# సుందరమ్మ వీథి

గొట్టాం పాంటు వేసుకుని, మోకాలి క్రింద వరకూ బురఖాలా చొక్కాలు తొడుక్కొని సైకిలుమీద ఏ కాలేజీ టిక్కు టిక్కు టక్కులాడి నేనా ఇంటివరకూ దిగబెట్టి వచ్చేవారేమో అక్కడ ఏదో చిన్న సన్మానంలాటిది జరిగివుంటుంది మీకు....అందుకని "సుందరమ్మ వీథి అంటే అంత కోపం-మీరు వెళ్ళరు సరిగదా రిక్షావాడిని కూడా ఆ వీథిని వెళ్ళనివ్వరు. అక్కడ ఏదో పెద్ద పోట్లాట కాని కొట్లాటగాని జరిగివుంటుంది చిన్నప్పుడు. అంటే ఆ రోజులలో పైలా పచ్చీసుగా కాలేజీలో చదువు

కునే రోజులలో-అమ్మాయి లంతా అందంగా వుంటారని అబ్బాయి లంతా బావుంటారని అనుకునే రోజులలో - పురుళ్లూ, పుణ్యాలూ బోలెడు అద్దెలూ, గంపంత సంసారమూ, అరువియ్యని షాపుకార్లు, హోదాలు, అంతస్తులు ఇవేవీ తెలియని అమాయకపు రోజులలో లాంతరు స్తంభాలు, సినిమా వాలుపోస్టర్లు పత్రికలు, పుస్తకాలే ప్రపంచం అనుకునే రోజులలో ఏ అందమైన అమ్మాయి మొహమేనా ఆకర్షిస్తే సైకిలు వెనకాలే తొక్కుకుంటూ మీరు వెళ్ళారనుకోండి, వెళ్ళితే తప్పేముంది? చిన్న ఈలపాటో పిసరంత జోకో వేశారనుకోండి సుందరమ్మ వీథిలో ఆ సుందరాంగి అన్నగారో బాబాయో సిన్మాలో విలనులా బయటకొచ్చి మీ చొక్కా పట్టుకున్నాడనుకోండి. ఆ టిక్కు టిక్కు టక్కులాడి తమ్ముళ్ళు మీ సైకిలు చక్రాల గాలి విప్పేసుంటారు దాన్తో మీ చక్ర భ్రమణం వక్ర భ్రమణమయి వుంటుంది.

తదనంతరంబ_ ఎందుకు లెండి యిదంతా నా ఊహాగానం!

తరువాత తెలిసింది_ మీరు చెప్పకపోయినా "సుందరమ్మవీథి"లో జరిగిన సంగతి,

మీలాటివాళ్ళకి కావలిసిందే లెండి శాస్తి _

బెజవాడలోని ప్రతిసందు మొగను, సెంటరును, ఆఖరికి కిల్లీకొట్లను కాఫీ హోటళ్ళను, తెగపొగిడి స్మృతి చిహ్నాలుగా నక్కదొసకాయలను, గోంగూరను కొరివికారాన్ని రైల్లో ఢిల్లీకి చేరవేసే ఆంధ్రధీర వీర పురుషులు మీరు __"సుందరమ్మవీథి" అంటే మండిపడతారెందుకు అనుకునేదాన్ని. బెజవాడలోని పుస్తకాల షాపులను, పత్రికలను పాత పుస్తకాల బడ్డీ దుకాణాలను పేరు పేరు వరుసలా ప్రస్తుతించి కీర్తించే మీరు, ఊరిని అంతా కలిపి మెచ్చుకుంటూ అందులో మళ్ళీ ఒక వీథిని బహిష్కరించడం అదైన తగినంత కారణం

లేకుండా నాకు అనుమానం కలిగింది. కాని చిక్క చిక్కని గోవులా సాధువులా ఎంత విశాల హృదయులైనప్పటికీ పిరికి గుండె జోకొట్టని అంతరాత్మకల మీరు ఆడపిల్ల గొడవల్లో పడరని పైదంతా నారీ సహజమైన అనుమానమూ అపవాదమేనని నాకుతెలుసు! ఆ జరిగిన కథ విన్నాక అలా జరగకూడదనిపించింది. ఎలా జరగకూడదో అలా జరిగి తీరుతుంది గ్యారంటీగా—

విధిని దాట వశమా- హా! హా! హా! అసలు బెజవాడలోనే మనుష్యులు సరిగా మాట్లాడరు. మర్యాద మన్నన చాలా తక్కువ. కసిరి కొట్టినట్లు మాట్లాడుతారు.

మన ఊరేగా-ఇక్కడేగా ఈ బెజవాడలోనేగా మనం పుట్టి పెరిగిందీ? మన ఊళ్ళో మనల్ని గౌరవంగా చూడకపోతే ఏంల? తలకాయ వంచుకుని వెళ్ళిపోతే సరిపోయేదానికి తగూలు తెచ్చుకోవడం దేనికి?

కాదు అదేం కాదు. జరిగిన సంగతి వేరు. మీరు చెప్పకపోయినా మి ప్రియమిత్రుడు హాస్య నటుడు "సుబ్బారావు" గారే నాకీ స్టోరి అంతా చెప్పి నవ్వించాడు.

హాస్యనటుడు సుబ్బారావుగారు కొత్త ఢిల్లీలో మనం వుండే వినయనగరంలో బి/71 సి/125. పి/891లో ఏదో ఒక 'కాంపరాజంలో ఒంటి గదిలో వుండే రోజులలో చిలక పెళ్ళాన్ని (పెళ్ళాన్ని చిలక అంటూ వుండేవాడు. ఆవిడ పళ్ళు. కాయాలు. పచ్చికూరలూ తిని బ్రతకాలిట హాస్యనటుడి భార్యగా పుట్టినందుకు) ఇంట్లో వదిలేసి రెండు మూడు రోజులకోసారి ఇంటికివచ్చి పలకరించి వెళ్ళేవాడట. వెంకట సత్యవతి చాలా అమాయకురాలు-తెలుగు తప్ప హిందీ. ఇంగ్లీషు వగైరాలు ఏమీ రావు. డబ్బులుకూడా యింట్లో వెతికినా కనిపించేవి కావుట. బియ్యం, ఉప్పు, పప్పు లేకుండా ఏకాదశి వ్రతాలుచేస్తూ హాస్యనటుడి

భార్యగా యింట్లో ఏడుస్తూ దీనంగా రోజులుగడిపే సత్యవతికి హిస్టీరియా ఫిట్టొచ్చి గదిలో పడిపోయి వుందట. అప్పుడు మీరెందుకోవెళ్ళి మీ శిష్యునికోసం కేకేస్తే అంతావచ్చి తలుపులు తీసిచూస్తేఈ అమ్మాయి ఫిట్టొచ్చి పడిపోయి నాలుక కొరుక్కున్నందువల్ల మూతంతా ఎర్రగా అయిపోయిందట. ముందు పలువరస కూడా దెబ్బతిని రక్తం కారుతోందిట. హాస్యనటుడు సుబ్బారావుగారు రిహార్సల్సులో ఎక్కడో యితరులను నవ్వించడం కోసం కుస్తీ పడుతున్నారట. ఇంట్లో చిల్లుకాని లేదట. మీరు వెంటనే ఆ వెంకట సత్యవతిని టాక్సీలో వేసుకుని రైల్వే ఆసుపత్రికి తీసుకెళ్ళి "నా భార్య ఫిట్టు వచ్చి పడిపోయిందని చెప్పి వైద్యం చేయించారట. హాస్యనటుడు సుబ్బారావుగారు మందు సీసా పుచ్చుకుని ఫలానావారి భార్యకి మందివ్వండీ అనిచెప్పి తన పెళ్ళానికి మందు తెచ్చుకునేవాట్ట ఆవిడకు రోగం కుదిరింది కాని ఆ ముందు పళ్ళు విరిగినందుకు మొహంవికృతంగా కనిపించేదట. నవ్వినపుడు పగిలిన పళ్ళు బయట పడతాయని ఆ అమ్మాయి పాపం నవ్వటం మానుకుందిట. మనం యిద్దరం నవ్వితే ఎల్లాగ నేను నవ్వుతాను నవ్విస్తాను నువ్వు నవ్వకు అని సుబ్బారావు సత్యవతిని సముదాయించేట్ట. మళ్ళీ ఇంకోసారి ఢిల్లీ నుంచి బయట పడేందుకు రైలు టిక్కట్టుకి డబ్బులు లేకపోతే ఆ హాస్యనటుడికి భార్య పేర పాసు యిచ్చిఫ్రీగా ప్రయాణం ఏర్పాటు చేశారట మీరు. ఆ వెంకట సత్యవతి. మేము సుందరమ్మ వీధిలో వుంటున్నాము మా యింటికి తప్పకుండా రావాలి అన్నగారూ అని మీ చేత ఒట్టేయించుకుందిట. మీ భార్య నని చెప్పుకుని. ఆ అమ్మాయి ప్రయాణం చేసింది.

హాస్య నటుడి భార్య అంటే మీకు చాలా జాలి. అందుకని మీరు బెజవాడ వచ్చినపుడు సుందరమ్మ వీధికి వెళ్ళి తిన్నగా సుంద

రమ్మగారింటికే వెళ్ళి చి॥ సౌ॥ వెంకట సత్యవతిని గురించి వాకబు చేసేరట!

మీకు బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదండీ- సుబ్బారావుగార్ని గురించి ఆడక్కుండా అమాయకంగా వెంకట సత్యవతిని గురించి అడిగి, చూడాలని పిలవండి అంటారా ఎక్కడన్నా....ఇది ఆంధ్ర దేశం. అందుకే సుందరమ్మగారు చేతులు తిప్పుకుంటూ వచ్చి-' నాయనా నువ్వు మా అల్లుడి స్నేహితుడివే కావచ్చు కాని-ఆ అబ్బాయి వచ్చినప్పుడు కూడారా- అంతే కానీ పరాయి వాడి పెళ్ళాన్ని చూడ్డానికి తగుదునమ్మా అంటూ వచ్చేవా! మాదేమి అలగా కుటుంబం కాదు. వెళ్ళు! వెళ్ళు! నీకు తెలీదేమో కాని. అలా మా అమ్మాయిని పేరెట్టి పిలిచి చూస్తారమ్మంటే నీ ఎదురుగుండా వచ్చి నిలబడుతుందనుకున్నావా? సిగ్గు సిగ్గు!" అని తలుపులు భళ్ళున వేసుగుందిట మొహం మీద.

ఈ స్టోరీ అంతా చి॥సౌ॥ వెంకటసత్యవతి మొగుడే నాకుచెప్పి నన్ను తెగ నవ్వించేడు.

నిజమే! హాస్యనటుడు అందర్నీ నవ్విస్తుంటే అతగాడి భార్య పరోక్షంగా మిమ్మల్ని ఏడి పించడం జాలి కథే. ఛార్లీ చాప్లిన్ తీసే హాస్యనటుడి స్నేహితుడి జాలి కథలా వుంది.

అందుకా మీరు "సుందరమ్మ వీధి" అంటే మండిపడతారు? పాపం-వెరీసారీ అండి!